కథా నిలయం
2058
శ్రీకాకుళం

# చేరిక

రేడియో ట్యూన్ చేశాను.

మలయపవనం వీస్తున్నట్లు, మంజు కుసుమామృతం లోని మధురిమ నిరర్గళంగా కురుస్తోన్నట్లు ఓ కంఠం పాడుతూ చకితుడ్ని చేసి వేసింది.

ఒక హాయి శరీరమంతా ప్రాకినట్లయి ఈజీచైర్‌లో వెనక్కివాలి, కళ్ళు మూసుకుని ఆలకించసాగాను.

ఆమె ఎవరో తన సన్నని కంఠంతో ఎలుగెత్తి పాడుతోంది. వెన్నెల విరిసినట్లు అదే క్షణంలో విషాదం కురిసినట్లు నేను కరిగిపోసాగాను.

ఆ పాట అయిపోయింది. మరోపాట. అదీ అయింది. మరొకటి. చివరికి గానం ముగిసింది.

అంత చక్కగా పాడిన కంఠం ఎవరిదోనని కుతూహల చిత్తుడనై కొంచం ముందుకు వొంగాను_కళ్ళు తెరిచి.

"ఆకాశవాణి, విజయవాడ కేంద్రం......ఇంతవరకూ పాడినవారు ఎస్. మాలతిగారు. తరువాత కార్యక్రమం కొద్ది క్షణాల్లో ప్రారంభ మౌతుంది."

ఎస్. మాలతి! నా గుండె నిలిచిపోయి నట్లయింది. ఎలాగో శక్తినంతా కూడదీసుకుని రేడియో ఆఫ్‌చేసి లేచి నిలబడ్డాను.

మాలతి! మాలతి!!

వెంటనే ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆలస్యంచేస్తే ఆమె వెళ్ళిపోతుందేమో! కలుసుకుని తీరాలి. శరీరమంతా విద్యుత్ ప్రవహిస్తూన్నట్లు – ఎనలేని బాధగావుంది.

రెండు మూడు అడుగులు వేశానోలేదో, ఎవరో అజ్ఞాత వ్యక్తి సందేహం ఒకటి చెవిలో ఊదినట్లు స్తబ్దుడ్నై నిలిచి పోయాను.

అవునో కాదో! ఆ వ్యక్తి కాదేమో!!

నిమిషాలు గడిచినకొద్దీ ఆందోళన ఎక్కువవుతోంది. ఇహ లాభంలేదని గబగబ చెప్పులు వేసుకుని క్రిందకువెళ్ళి, తన గదిలో కూర్చుని శ్రద్ధగా చదువుకుంటూన్న రాధని గట్టిగా పేరుపెట్టి కేకేశాను.

"ఎందు కన్నయ్యా?" అని అంది రాధ పుస్తకం విడిచిపెట్టకుండానే తలఎత్తి చూస్తూ.

"ఒకసారి నాతో బయటకు రావాలమ్మాయ్. మళ్ళీ ఓ పావుగంటలో తిరిగి వచ్చేద్దాం. లే. బయల్దేరు" అన్నాను లాలనగా.

"పరీక్షలింకా వారం రోజులుకూడా లేవన్నయ్యా, చదువుకోవాలి మరి" అంది దీనంగా ముఖంపెట్టి.

"ప్లీజ్! నిన్ను ఎక్కువసేపు డిస్టర్బ చెయ్యను. నీతో బోలెడు పనివుంది. రా మరి" అన్నాను బ్రతిమాలుతున్న ధోరణిలో.

ఆమె యిహ లాభంలేదని గ్రహించి పుస్తకం ప్రక్కకి నెట్టి "ఏమిటి సంగతి?" అని ప్రశ్నించింది కుతూహలంగా.

"కారులో చెబుతాను. త్వరగా రా."

ఆమె లేచి మూలనున్న చెప్పులు తొడుక్కొని బయటకు వచ్చింది. 'పద' అంటూ, ఇద్దరం బయటికి పోతూండగా వెనకనుండి వంటవాడు వరహాలు "బాబూ! భోజనానికి వేళయింది. యిప్పుడెక్కడికి పోతున్నారు?" అంటూ కేకేశాడు.

"ఓ పావుగంటలో వస్తాము. తలుపులేసుకో" అని చెప్పి గరాజ్‌లోకి వెళ్ళి కారు బయటికి తీసుకు వచ్చాను. రాధ వొచ్చి ప్రక్కన కూర్చుంది. ఓ వందగజాల దూరమైనా పోకముందే "యిప్పుడు చెప్పు, ఏమిటి యీహడావుడి'అంతా?" అని అడిగింది ఉత్సుకతతో.

"మన మిప్పుడు ఎ. ఐ. ఆర్. స్టూడియోస్‌కు పోతున్నాం" అని సమాధానం చెప్పాను.

"ఎందుకు?"

"మాలతి అని ఓ గాయని యింతకుముందే ఓ చక్కని ప్రోగ్రాం యిచ్చింది. ఆమె ఎవరో ఎక్కడి మనిషో నాకు

తెలీదు. ఆమెతో నువ్వు పరిచయం చేసుకుని, వీలైతే మన యింటికి ఆహ్వానించాలి."

"ఆమెని నీకు పరిచయం చెయ్యాలి" అని కిలకిల మని నవ్వింది రాధ.

"తప్పా ?" అన్నాను ఉక్రోషంగా.

నవ్వు ఆపుకుని "తప్పుమాట అలావుంచు, ఆమెమీద ఎందుకంత యింటరెస్ట్ ? ఇదివరకు ఎంతమంది పాడగా విన లేదు? ఆమె అంత అమోఘంగా పాడిందా?" అని అడిగింది.

నే నేం జవాబు చెప్పలేదు.

"కోపం వచ్చిందా?" అనడిగింది చిలిపిగా.

"కొంచెం" అన్నాను నవ్వి.

"మా అన్నయ్య మంచివాడు. ఎప్పుడూ కొంచెమేగాని, అంతకుమించి కోపంరాదు. సరే అంతరార్థాలు నా కెందుకు? నా డ్యూటీ నేను చేస్తాను."

నాలో నేను నవ్వుకుని మౌనంగా ఊరుకుని, స్పీడ్ కాస్త హెచ్చింపచేశాను.

మరో అయిదు నిమిషాలకల్లా కారు గమ్యస్థానం చేరు కుంది. గేటు లోపలికి పోనిచ్చి ఓ చెట్టు ప్రక్కన ఆపాను.

వసారాలో ఎలక్ట్రిక్ లైట్ల వెలుగులో కొంతమంది మనుషులు తిరుగాడుతున్నారు. మే మిద్దరం కారు దిగి ప్రక్క నే వున్న గదిలో టెలిఫోన్ దగ్గర కూర్చున్న అమ్మాయి దగ్గరకు వెళ్ళాక "యింతకుముందు ప్రోగ్రాం యిచ్చిన మాలతిగారు ఎక్కడున్నారు ?" అని ప్రశ్నించింది రాధ మర్యాదగా.

"అవతల హాల్లో వుంటారు. చెక్కు తీసుకునేందుకు వెళ్ళారు" అని చెప్పిందా అమ్మాయి.

ఒకవేళ యీ పాటికి ఆమె వెళ్ళిపోయిందేమో అని దిగులు పడుతూన్న నాలో ఆశాభావం మొలకెత్తింది.

ఇద్దరంకలసి ప్రక్కకిమళ్ళి హాలువేపు పోతున్నాం. అదే సమయానికి లోపల్నుంచి చేతిలో ఏదో కాయితాన్ని పట్టుకుని ఓ యువతి యివతలకి వస్తోంది. మనిషి చాలా సుకుమారంగా, సౌమ్యంగా వుంది. చప్పున కనిపించే ఆకర్షణ... నయనదళ కాంతులు.

లోపల యింకెవరూ స్త్రీలు కనబడటంలేదు. నేను రాధవంక భావయుక్తంగా చూశాను. తనుకూడా నావంక ప్రశ్నార్థకంగా చూసి, వెంటనే చూపు మరల్చుకుని ఆ యువతి వైపుకు ఎదురుగా వెళ్ళి "నమస్కారమండీ" అంది చేతులు జోడించి.

ఆమె తెల్లబోయి, చప్పున సర్దుకున్నట్లు "నమస్కారం" అంది తనూ. రాధ సంకోచాన్ని అవతలకునెట్టి "మీరు మాలతి గారనుకుంటాను" అంది.

"అవును" అందామె చిన్నగా.

"ఇంతకుముందే మీ అపూర్వ గానామృతం గ్రోలి ఆనందించాం. వెనువెంటనే మిమ్మల్ని చూడాలన్న కోరికను అణుచుకోలేకపోయామంటే నమ్మండి. ఇలా పరుగెత్తుకు వచ్చాం" అని రాధ కోసిపారేసింది.

ఆమె యిరుకున పడ్డట్లుగా తెలిసిపోతూన్న ముఖంతో "థాంక్స్ అండీ" అంది.

"నాపేరు రాధ. నేను బి. యస్. సి. చదువుతున్నాను. ఇతను మా అన్నయ్య మధు; డాక్టరు"

నేను అంతవరకూ కొంచం దూరంగా నిల్చున్నాను. దగ్గరకువచ్చి "నమస్తే" అన్నాను. ఆమే నమస్కారంచేసి మొహమాటపడుతూ నిలబడింది.

రాధ మళ్ళీ తనే కలుగజేసుకుని "మీది యీ ఊరు కాదనుకుంటాను. ప్రోగ్రాంకోసం వచ్చివుంటారు. ఎక్కడ దిగారు? ఎవరైనా చుట్టాలింట్లో బసచేశారా? మేము మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చాంగనుక మీ అభిమానులం అని తెలిసిపోతూంది. ఇప్పుడు మీతో ఎవరూ రాలేదుకదా! కాస్త మా ఆతిథ్యం స్వీకరించుదురుగాని రండి" అని గడగడ అప్పచెప్పేసింది.

ఈ ధోరణికి చకితురాలయినట్లు కనబడిన ఆమె ఎలాగో తెప్పరిల్లి "నేను యీ ఊళ్ళోనే వుంటున్నాను" అంది మంద స్వరంతో.

ఈసారి చకితులమయేవంతు మాది; "వాట్?" అన్నాను కంఠం పెగుల్చుని.

"అవును. మూడునెల్లయింది వచ్చి. మాంటెసోరీలో టీచర్‌గా వర్క్ చేస్తున్నాను. రేడియోలో ఆడిషన్‌కి ఎప్లయి చేసి సెలెక్టు అయాను. ఇది నా మొదటి ప్రోగ్రాం!"

ఏం మాట్లాడాలో తెలీక యిద్దరం వింటూ నిలబడ్డాం.

"నామీద మీకు కలిగిన ఆదరాభిమానాలను కృతజ్ఞురాల్ని... ఆలస్య మవుతోంది. వెళ్తాను" ఆమె కదిలింది.

"ఆగండి" అన్నాను నేను కంగారుగా. "మేము కారు మీాదే వచ్చాం, మీా యిల్లు చెప్పండి, డ్రాప్ చేస్తాను"

ఆమె మొహమాటపడుతూ "ఎందుకులెండి నడిచే వెళ్తాను. వెన్నెలగానే వుంది" అన్నది.

నేను ఆత్రంగా రాధవైపు చూశాను.

ఆమె ఒక అడుగు ముందుకువేసి, ఆప్యాయంగా గాయని చెయ్యిపట్టుకుని "బలేవారు. ఈ రాత్రివేళ వంటరిగా నడిచివెడతా నంటున్నారా? విజయవాడ రోడ్లమీాద జరిగే అఘాయిత్యాలగురించి మీాకు తెలిసినట్టులేదు" అని బయటకు దృష్టిసారించి "దగ్గర్లో రిక్షాలుకూడా వున్నట్లుగా లేవు. ఇహ మీాకు తప్పదు, మా ఆతిథ్యం స్వీకరించకపోతేమానె, మీా యింటిదాకానైనా సాగనింపనివ్వండి" అని బలవంతంచేసింది.

ఆమెకు యిహ అంగీకరించక తప్పలేదు. "పదండి" అని కదిలి మమ్మల్ని మవునంగా అనుసరించ సాగింది.

కారులో కూచున్నాక "ఎటువైపు పొమ్మన్నారు?" అని ప్రశ్నించాను సెల్ఫ్ లాగుతూ.

వెనకసీట్లో కూచున్న ఆమె "సూర్యారావుపేట" అని సన్నని స్వరంతో జవాబిచ్చింది.

బిషప్ అజరయ్యా ఆడపిల్లల స్కూలుదాటి, రోడ్డు మలుపు తిరిగి కారు సూర్యారావుపేట వైపు కదిలిపోతోంది. ముగ్గురంసీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు నిశ్శబ్దంగా కూర్చున్నాం.

"మీా యింటిపేరు ఎస్. కదూ. ఎస్ అంటే?" అనడిగాను వున్నట్లుండి.

"సామవేదం"

చేతిలో స్టీరింగ్ వొణికినట్లయింది. విద్యుద్ఘాతం తగిలినట్లు శరీరమంతా దడదడలాడి, నిశ్చేష్టుడనై పోయాను.

ఏదయితే అనుకున్నానో – అదే జరిగింది.

ఏమయితే ఆశించానో – అదే తటస్థించింది.

ఎడమచేత్తో జేబులోంచి కర్ఛీఫ్ తీసి ముఖంమీది స్వేద బిందువులు తుడుచుకుంటున్నాను.

రాధ కనిపెట్టింది, నావైపు ఓరకంట చూసి, తన మృదువైన వ్రేళ్ళతో భుజంమీద తట్టి "దారి కనుక్కోకుండా పోనిస్తావేమన్నయ్యా" అన్నది .మృదుస్వరంతో.

"ఇటే. సరిగ్గానే పోతున్నారు" అంది వెనకనుండి మాలతి.

తర్వాత ఎవ్వరూ మాట్లాడలేదు. ఆమె చెబుతోన్న గుర్తుల ప్రకారం కారు ఓ చిన్న పెంకుటింటి ముందుకు వచ్చి నిలిచింది.

ఆమె దిగి కృతజ్ఞతలు చెప్పటం అయ్యాక "వారం రోజుల్లో మళ్ళీ నేను వస్తాను. ఈసారి మీరు తప్పించుకుంటే కుదరదు. నాతో మా యింటికి రావాలి" అంది రాధ నవ్వుతూ.

"తప్పించుకోను, వస్తాను. నాకు మాత్రం యీ ఊళ్లో ఎవరున్నారు ? ఒక్కర్నీ తోచక సతమత మవుతున్నాను."

సెలవు తీసుకోటం అయినాక, ఓ నిట్టూర్పు విడిచి, గేర్ వేసి, క్లచ్ రిలీజ్ చేశాను.

ఓ వంద గజాలైనా పోయామో లేదో "ఇప్పుడు చెప్పు" అంది రాధ ఆకస్మికంగా.

నేను తెల్లబోయి "ఏమిటి?" అన్నాను గొణుగు తున్నట్లు.

"మాలతి ఎవరు ? ఈ చకితమవటం ఏమిటి ? చైతన్య మేమిటి ?"

నేనేమీ జవాబు చెప్పలేక, దృష్టినంతా డ్రైవింగ్ మీద కేంద్రీకరించినట్లు నిశ్శబ్దత వహించాను.

"ఆమె యింటిపేరు చెప్పగానే నీలో చెలరేగిన అలజడి గమనించాను. ఆమె నీకు తెలుసు"

నేనేమీ సమాధానం యివ్వలేదు.

"చెప్పవూ అన్నయ్యా?" ఈసారి రాధ గొంతులో వేదన పొడగట్టింది.

"ఏమీ లేదమ్మా" అన్నాను నేను ఆర్ద్రహృద యంతో. మా యిద్దరి బాంధవ్యమూ విచిత్రమయినది. అమ్మా, నాన్నా పోయినప్పట్నుంచి రాధకు నేనే తల్లినీ, తండ్రినీ. బయటకు ఎంత చిలిపిగా వుంటుందో మనసులో అంత అభిమానమూ, అనురాగమూ వున్నాయి. "ఒంటరి తనం భరించ లేకుండా వున్నా నన్నయ్యా. వదిన్నెప్పుడు తీసుకువస్తావు?" అనేది ఎప్పుడూ గారాబంగా. "ఆఁ ఆఁ అదే అనుకుంటున్నాను రాధా. మరి నాకు ఎవరూ పిల్ల నివ్వటం లేదు" అని నేను జవాబిచ్చేవాడ్ని. నవ్వి, "పో. అన్నీ అబ ద్ధాలు. నీకన్న మంచి సంబంధం ఎక్కడ వుంటుంది ?"

"మాలతి చాలా అందంగా, సుకుమారంగా వుంది" అంది కొన్ని క్షణాలు గడిచాక నావంక క్రీగంట చూస్తూ.

అప్పటికీ నేనేమీ మాట్లాడలేదు. ఆమె యింక విసుక్కుని "పో! నువ్వు చాలా పెంకె అన్నయ్యవు. ఏమాత్రం బయటకు తేలవు" అని బయటకు చూడసాగింది.

*　　　*　　　*

మరునాడు సాయంత్రం అయిదు గంట లయింది. ఆ చిన్న పెంకుటింటి ముందు కారాపి, మెల్లిగా గుమ్మంముందుకు వచ్చి నిలబడ్డాను.

నా కాళ్ళు కొంచం తడబడుతున్నాయి. "మాలతి గారూ!" అని పిలవాలని ప్రయత్నం.

ఇంతలో తలుపులు తెరచుకున్నాయి. ఎదురుగుండా మాలతి నన్ను చూసి ఆశ్చర్యచకితయై "మీరా?" అంది. వెంటనే తేరుకుని "రండి" అని ఆహ్వానించింది.

నేను ఆమెవెంట లోపలకు దారితీసి ఆమె చూపిన కూర్చీలో కూర్చున్నాను. మౌనంగా ఎదురుగా గోడకానుకొని నిలబడింది. నా రాకలోని ఆంతర్యం తెలీక తికమకపడుతూ వుంటుంది, బహుశా.

"అప్పుడే వస్తారనుకోలేదు" అంది చివరకు.

"నే ననుకున్నాను. ఎంతత్వరగా వీలుంటే అంతత్వరగా కలుసుకోవా లని పించించింది"

"ఎందుకు?"

"నేను మీకు అపరచితుడ్ని కాదుగనుక"

ఆమె ముఖంలో మరింత ఆశ్చర్యం ద్యోతకమయింది. "నేను మిమ్మల్ని ఎరుగను"

9)

"నాకు తెలుసు."

"అయితే...?"

"కమల మీ చెల్లెలు కదూ!"

ఆమె నిర్ఘాంతపోయింది. "మీ కెలా తెలుసు?"

నేను ఆ ప్రశ్నకి జవాబివ్వకుండా "మీకు తెలీకుండా మీకు నేను చాలా ద్రోహం చేశాను" అన్నాను.

ఆమె నన్ను ఉన్మాదునిగా భావించిందేమో. మెదలకుండా ఊరుకుంది.

"నాకేమీ బోధపడటంలేదు."

"చిత్రంగా వుందికదూ— కాని నేను చెప్పక తప్పదు. ఒక రకంగా చూస్తే చాలా చిన్న విషయం. కాని ఎంత విపరీత పరిణామానికి దారి తీసిందో చెప్పమంటారా?"

పరిస్థితి అంతకంతకూ అయోమయంగా మారటం చూసి ఆమె తల ఆడించి వూరుకుంది.

"మురళీ, నేను, క్లాసుమేట్సుము" అన్నాను.

"కమల భర్త-?" అందామె ఆశ్చర్యంగా.

"అవును. అంతేకాదు. రూమ్‌మేట్సుముకూడా హాస్టల్లో. ఇద్దరం కలిసే చదువుకునేవాళ్ళం. ఎంతో కలసి మెలసి వుండేవాళ్ళం. మా యిద్దరి మధ్య ఎటువంటి దాపరికం వుండేది కాదు.

"అతనిదీ, మీదీ ఒకేవూరు కదూ! మీ నాన్నగారి గురించి చాలాసార్లు ప్రసంగవశాత్తూ చెప్పాడు. మీది చాలా బీదకుటుంబమనీ కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యలేక మీ నాన్నగారు చాలా యిబ్బంది పడిపోతున్నారనీ చెప్పేవాడు.

"మీ చెల్లెలు అతనికి ఉత్తరాలు రాస్తూండేది. వాళ్ళిద్దరికీ చిన్నప్పటినుంచీ పరిచయం వున్నదిట. ఒకర్నొకరు వివాహం చేసుకోవాలని ఏనాడో సంకల్పించుకున్నారు. వాళ్ళ సంకల్పం గురించి వాళ్ళకు ఎలాంటి సందేహం లేదు. త్రికరణశుద్ధిగా నిశ్చయించుకున్నారు.

"కాని యిక్కడే ఓ చిత్రం జరిగింది. మీ నాన్న గారికి యిద్దరు కూతుళ్ళని నాకు తెలుసుగాని – కమలే ఎందుకో పెద్దకూతురన్న అభిప్రాయం నాకు కలిగింది. ఆ విషయాన్ని నాకతను ఎన్నడూ విడమర్చి చెప్పలేదు. మొదట్నుంచీ అదే అభిప్రాయం వుండటంవల్ల నాకు సందేహమూ రాలేదు.

"కోర్సు పూర్తయితేనే గాని, తన కాళ్ళ మీద తాను తాను నిలబడగలిగే స్థితి వస్తేనేగాని అతనామెను పెళ్ళి చేసుకోననేవాడు. దానికి తమ కుటుంబ పరిస్థితులు అడ్డు వస్తాయిట.

"మేము ఫ్రంటియర్‌లో వుండగా ఒకసారి సెలవులకి యింటికి వచ్చాను. అప్పుడో స్నేహితుడు కలసి ఏదో మాటల సందర్భంలో తనకు పెళ్ళి జరగేటట్టుగా వుందని, ఆ వివరాలు చెప్పుకొచ్చాడు. ఫలానా ఊళ్ళో ఫలానా చలపతిరావు గారమ్మాయనీ, ఏమీ స్థితిమంతులు కారనీ, అయినా పిల్ల అందంగా వుంటుంది కాబట్టే మిగతావన్నీ వెనక్కినెట్టి, స్థిరపడేటట్లు వుందనీ చెప్పాడు. తప్పకుండా ఆమె తన భార్య అయితే చాలన్న దృఢసంకల్పం కన్పిస్తోంది అతని మాటల్లో.

"నాకు గుండె ఆగినంత పనయింది. మురళి నా ప్రాణ మిత్రుడు. తాను ఆమెను చేసుకోవటం యింట్లో ఎవరికీ యిష్టం లేదనీ, అందుకని తను స్వతంత్రుడ్ని కావాలనీ చెబుతూ వుండేవాడు కద. ఇప్పుడేమో అతనికి అన్యాయం జరగబోతూంది. ఆమెపట్ల అతనికెంత గాఢానురాగంవుందో నాకు తెలుసు. ఆమె మరొకరి పత్ని కావటం సంభవిస్తే అతనికి మతిచెడినంత పని జరిగి చదువు మాని పారిపోవచ్చు. నాకు విపరీతమైన భయం కలిగింది.

'నువ్వా అమ్మాయిని పెళ్ళాడటానికి వీల్లేదు' అన్నాను దృఢస్వరంతో.

'ఎందుకని' అన్నాడా స్నేహితుడు విభ్రాంతుడై.

"ఏమి చెప్పాలో తోచలేదు. ఎట్లా అతనికి నచ్చచెప్పాలో? [illegible] [illegible]న్నాను. 'వద్దు' అన్నాను చివరికి.

'ఏ విధంగా అది నాకు మంచి? విడమర్చి చెప్పందే నాకు ఎలా తెలుస్తుంది? అని అడిగాడతను అయోమయంలో పడి.

"ఇహ లాభంలేదనుకుని ఆమెకు మరో వ్యక్తితో ప్రేమసంబంధముంది" అని చెప్పేశాను.

"నువ్వు చూచావా?" అన్నాడు అప్రతిభుడై.

"అప్పుడిహ విధిలేక కథ అంతా అతనికి విస్తరంగా చెప్పాను. అంతా విని అతను 'ఎంతమోసం! ఇలాంటి శీలం లేని పిల్లని నా కంటగడదామని ప్రయత్నించారన్న మాట.

ఇంకానయం. మొదట్లోనే చెప్పి బ్రతికించావు' అని వాళ్ళని దుర్భాషలాడుతూ వెళ్ళిపోయాడు.

'శీలంలేనిపిల్ల' అని అతను వాడిన భాష నన్ను చాలా కలతపరిచింది. నావల్ల కదా ఆమె అలాంటి మాట పడాల్సి వచ్చిందని ఖిన్నుడ్నయ్యాను ... కాని ఆ సంబంధం తప్పిపోయింది. అందుకని పర్యవసానం మంచిగానే పరిణమించింది కదా అని సంతోషించాను.

"అయితే చలపతిరావుగారు తన కూతుర్ని మరొకడికి యిచ్చి పెళ్ళి చెయ్యటానికి ఎందుకు ప్రయత్నించినట్లు? మురళి చెప్పిన పరిస్థితులకి ఎదురీదటం యిష్టంలేక యిలా ప్రవర్తించి వుండవచ్చునని సమాధానపర్చుకుని సంతృప్తిపడ్డాను

"తరువాత విశాఖపట్నం వచ్చేశాను. ఈ విషయం మురళికి చెబుదామా వద్దా అన్న సందిగ్ధంలో పడి, చెబితే అతను నొచ్చుకోవటం మినహా ప్రయోజనం వుండదని మానేశాను.

"రోజులు గడిచాయి. ఇద్దరం కోర్సు పూర్తి చేశాము. నేను ప్రయివేటు ప్రాక్టీస్‌లో పడ్డాను. మురళి అసిస్టెంట్ సర్జన్‌గా చేరాడు.

"అతని కాళ్ళమీద అతను నిలబడేశక్తి వచ్చిందిగా... ఒకరోజు శుభలేఖ తీసుకొచ్చి చేతికిచ్చాడు. ఆనందంగా చూశాను. అతని పెళ్ళి కమలతో. కాని... చలపతిరావుగారి రెండో కూతురని వుండేమిటి? అంతవరకూ పొరపాటున కూడా నేనలా ఊహించలేదు. నాగుండె గుభేల్‌మంది. 'కమల రెండో కూతురా? అనడిగాను విచలిత కంఠంతో.

'అవును. మొదటి అమ్మాయిపేరు మాలతి!'

'ఆమెకు పెళ్ళయిందా' అనడిగాను ఆత్రంగా.

'కాలేదు' అన్నాడతను నిట్టూర్పువిడిచి.

"నా వెన్నుమీద ఎవరో అజ్ఞాతవ్యక్తి క్రోధంతో చరిచినట్లయింది. చేసిన తప్పిదం తెలిసినట్లయి బాధతో, పశ్చాత్తాపంతో కుంచించుకుపోయాను.

'ఎందుకు కాలేదు? అనడిగాను అతిప్రయత్నంమీద.

'కావలసిందే. కాని లోకం చాలా చెడ్డది.' అన్నాడు మురళి కసిగా.

'ఆయన చాల పేదవాడని చెప్పానుకదూ, ధనం ధారపొయ్యలేడు. అప్పటికీ శాయశక్తులా ప్రయత్నించి ఓ మంచి సంబంధం కుదిర్చాడు. ముహూర్తం నిర్ణయించే దాకా వచ్చింది. కాని యింతలో ఏదో వైపరీత్యం జరిగింది. శీలం లేనిపిల్ల అని యీ పెళ్ళి చేసుకోము అన్నారుట వాళ్ళు. ఎలాపుట్టిందో, ఎందుకు ఆమెమీద అలాంటి అపవాదు వ్యాపించిందో తెలీదు. ఈ విషయం ఆ ఒక్క సంబంధంతో ఆగక అన్నిచోట్లకూ ప్రచారమైంది. ఆమెను చేసుకోవటానికి ఒక్కరూ ముందుకు రాలేదు. ఆయనపడ్డ శ్రమకూ, మానసిక వ్యధకూ అంతులేదు. నేనేమో యిక్కడ కోర్సుపూర్తి చేసుకుని కూర్చున్నాను. బాధగావున్నా కమలసంగతి ఎత్తాను. పెద్దపిల్లను పెళ్ళికాకుండా రెండోదాని పెళ్ళిచేస్తే పెద్దామెగతి ఏమవుతుందని ఆయన దిగులుపడ్డాడు. పస్తాయించాము. కాని యిలా ఎన్నాళ్లు? 'నాకోసం కమల జీవితం

పానుచేయవద్దు నాన్నా' అంటూ మాలతి ముందుకు వచ్చింది. తండ్రితో వాదించి కష్టపడి వొప్పించింది.

"జాలి, కరుణ, విషాదం, మానసిక క్లేశం యిన్ని నిండివున్నాయి మురళి మాటల్లో.

"ఎంతపని చేశాను!_ అని నన్ను నేను నిందించు కున్నాను. నాకు నేను ఓ రాక్షసుడిగా కనపడ్డాను. ఎంత మందమతిగా, అవివేకంగా, పశువులా ప్రవర్తించాను! నావల్ల ఓ నిండు జీవితం బలై పోయింది."

"మురళిలోకూడా లోపం లేకపోలేదు. అతను ఎంత సేపూ తనప్రేమ, ఆశయం, ఆదర్శం వీటిగురించే వర్ణించే వాడుగాని ఆయన కూతుళ్ళని గురించిన వివరాలు ఏనాడూ అర్థమయేటట్లు చెప్పలేదు. అట్లా చెప్పలేకపోవటం అతని అల వాటు."

"ఏమయితేనేం? నేను పశ్చాత్తాపంతో, మనస్తాపంతో దహించుకు పోయాను. కుమిలిపోయాను.

"మాలతి కిలాంటి అన్యాయం జరిగిందని ఇన్నాళ్ళూ ఎందుకు చెప్పలేదని అడిగాను.

"చెప్పలేక పోయానన్నాడు. అతని అంతరాత్మ అం గీకరించలేదట.

"నాకు వెర్రిఆవేశం వచ్చింది. 'మాలతిని నేను పెళ్ళి చేసుకుంటాను' అన్నాను గట్టిగా.

"అతను నివ్వెరపోయాడు. నమ్మలేనట్లు చూశాడు. అతని ముఖమంతా ఆనందచిహ్నాలు వ్యాపించాయి. నన్ను గాఢంగా కౌగలించుకున్నాడు. కాని ... కొద్ది సేపట్లోనే

అతన్ని విచారం క్రమ్మివేసినట్లు కనిపించాడు. 'లాభంలేదు' అన్నాడు నిస్పృహగా.

'ఎందుకు? ఎందుకని?' అన్నాను ఎంతో ఆరాటంతో.

"ఆయన పరమ ఛాందసుడు. మరో కులంవాడికి తన పిల్లని యివ్వడు_ ప్రాణం పోయినాసరే. నీ త్యాగం వృథా అయింది మధూ!"

"త్యాగం కాదు, త్యాగం కాదు" అని అంతరాత్మ ఘోషిస్తోంది నాలో. కుతకుత లాడుతోంది.

"మురళి పెదవివిరిచి.శుష్క-మందహాసం చేసిప్రయోజనం లేదుబ్రదర్.లక్షణంగా అరవై వేలు తీసుకువచ్చే మరోకన్యను పెళ్ళాడక తప్పదు నీకు" అన్నాడు.

"నేను నిట్టూర్పు విడిచాను. దీనికంతటికీ కారణం నేనని మురళితో చెప్పలేకపోయాను ... భారహృదయం మిగిలింది.

"అతను పెళ్ళిచేసుకుని పై చదువుకి స్టేట్స్‌కి వెళ్ళాడు. మీ ఆత్మాభిమానం గురించి చెప్పాడు. మీరు ట్రెయినింగ్ అవుతున్నారని విన్నాను. మీరు కనిపిస్తే_ ఆవిషాదం భరించలేనేమోనని ఏదోవంక చెప్పి, అతనికి కోపంవచ్చినా సరే _ పెళ్ళికి రాకుండా తప్పించుకున్నాను.

"ఇన్నాళ్ళ తర్వాత అనుకోకుండా చిత్రమైన పరిస్థితిలో మిమ్మల్ని కలిశాను."

ఆమె గోడకు ఆనుకుని అలాగే నిలబడి నిశ్చేష్టితమై వింటోంది. ఆమె విశాల, విషాద నేత్రాలు ఆపుకోలేని

కన్నీటిని స్రవిస్తున్నాయి. అందమైన ఆమె కనురెప్పలు మందమైన ఆ నీటితో తడిసి బరువుగా కదులుతున్నాయి.

"మీకు అక్రమంగా అన్యాయం చేసిన ధూర్తుడ్ని మాలతిగారూ నేను, టీచర్ చేస్తున్నందుకూ, మీ వంటరితనానికీ, అశాంతికీ – బాధ్యుడ్ని నేను. నేను అపరాధం చేశాను, శిక్షార్హుడ్ని!"

తలవొంచుకు కూర్చున్నాను. తప్పు ఒప్పుకున్నానన్న తృప్తి ఒకపక్క, పీడని అశాంతి ఒకపక్క చోటు చేసుకున్నాయి.

ఎన్నో నిముషాలు బరువుగా... అస్థిమితంగా గడిచాయి.

"మీరు తెలిసి చేయలేదు" అన్న ఆర్ద్రస్వరం చాలాసేపటికి నిలబడి తలయెత్తి చూశాను.

మాలతి నావంక సూటిగా, పొడిగా చూస్తోంది. "నిమిత్తమాత్రులు మీరు. మంచికే ప్రయత్నించారు. విధి శపించినప్పుడు మీరేం చేస్తారు డాక్టర్" అంటూ ఆమె పెదాలు కదిలినయ్.

కాని యీ సమాధానం నాకేం తృప్తినివ్వలేదు. నాకు కావలసినవి ఓదార్పూ, సానునయ వాక్యాలూ కావు. మంచులా తాకే సంఘటన ఒకటి విరుచుకుపడాలి.

"నాకు యీ ఉపశమన వాక్యాలు ఊరట కలిగించలేవు మాలతిగారూ! నేను ఏమి ఆశించి యిక్కడకు వచ్చానో ఏది లభ్యమౌతుందని ఎదురుచూస్తున్నానో నాకే స్పష్టంగా

తెలీదు. ఈ కాసిని సంవత్సరాలూ నిర్దాక్షిణ్యంగా, నిస్సారంగా కాలిపోయినయ్ కాలాగ్నిలో. ఎందుకని ఒంటరితనాన్ని అభిలషిస్తూ వచ్చానో సరిగ్గా నిర్వచించుకోలేకపోయాను" అని నిట్టూర్పు విడిచి "మీ నాన్నగారు ఎక్కడున్నారు? కులాసాగా వున్నారా?" అని అడిగాను.

"నాన్నగారుపోయి ఏడాదయింది."

నేను ఉలిక్కిపడ్డాను. మురళి భార్యతోకూడా అమెరికా వెళ్ళాక ఒకటిరెండు ఉత్తరాలు రాశాడంతే, తరువాత మా యిద్దరిమధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. ఆమె వంక పరిశీలనగా చూశాను. ఆ క్షణంలో మూర్తీభవించిన శోకంలా కనిపించింది. అట్లాగే చూస్తూ కూర్చున్నాను. ఆమె నావైపు చూడటంలేదు, కిటికీనుండా బయటకి వ్యాపిస్తోన్న చీకటిలోకి తిలకిస్తోంది.

ఇది విషాదం. మొయ్యరానంత బరువు. ఇంకోమూల రాగరంజితం. అలవికానంత విశాలం.

బయటకు చెప్పలేను. చెప్పలేకపోయాను—కాని నాకు తెలుసు; ఆమె ఎప్పుడో ఆక్రమించుకో నారంభించిందని, ఆక్రమించుకున్నదని.

నా నేత్రాలు తరళిత మౌతున్నట్లు తోచాయి.

"మాలతీ!" అని పిలిచాను.

నా పిలుపు నాకే మృదువుగా, అపూర్వంగా అనిపించింది.

ఆమె ఉలికిపాటుతో ముఖం యిటువైపు త్రిప్పింది. ఆమె నాయందు అప్రసన్నురాలు కాలేదు. నన్ను క్షమిం

చింది. కాని... అడుగుదామని ఎంత ప్రయత్నిస్తున్నా పెదాలు కదిలి తరువాత మాటలు వెలికి రావటంలేదు.

"ఏమిటీ?" ఆమె అడుగుతోంది. ఆశ్చర్యంగా గ్రుచ్చి గ్రుచ్చి చూస్తోంది.

"భ...వ...తి...భిక్షాం దేహి!"

ఆమె నిలువునా వొణికినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తర్వాత.

ఈ బిక్ష నా పాపానికి పరిహారంగా కాదు. సానుభూతి అంతకన్న కారణంకాదు. స్వార్ధంతోనే అడుగుతున్నాను – నిన్ను చూశాక. మన కలయిక వ్యవధి అల్పం. పరిచయం స్వల్పం. అయినా వెనుకటిగాథ. అనుభవించిన వ్యథ, నీ సౌజన్యం ఆకర్షణంగా మారి మంత్రిస్తున్నయి నన్ను. మాలతీ! ఈ చనువును మన్నించి ఆలోచన చెయ్యి. నేను నీతిమాలిన వాణ్ని దుర్మార్గుణ్ని కాను. ఉన్నరూపం ఇది. కులంవిషయంలో అడ్డులేకపోతే...మీ...నీ యిష్టానికి వొదిలేశాను. వెళ్ళనా? వుండనా? నువ్వే చెప్పు!"

నా కంఠ గాద్గద్యం శ్రవణ కుహరంలోకి సూటిగా సోకుతోంది. కొన్ని క్షణాలు ఆమెను విడిచిపెట్టి నేను శూన్యంగా నిలిచిపోయాను.

ఆ క్షణాలు గడిచాయి, ఆమె కదిలింది. ఆత్రంగా చూశాను. కాని ఆమె అధరాలు దాటి ఏమాటా బయటకు రావడంలేదు. ఆమె కన్నులలోని భావసంచయాన్ని పోల్చుకోలేకపోయాను.

"ఉండనా? వెళ్ళనా?" అన్నాను మళ్ళీ.

అప్పటికీ ఆమె మాట్లాడలేదు.

నేను విచ్ఛిన్న హృదయంతో నిరాశగా లేచి నిలబడ్డాను. "వెళ్తాను" అన్నాను చలించే కంఠంతో ఎలాగో. నా పాదాలు కదిలినై.

"ఆగండి" వెనుకనుండి తొట్రుపాటుతో కూడిన స్వరం కలగా వినవచ్చింది. ఆగి, తలత్రిప్పి చూశాను.

ఒక అడుగు ముందుకు వేసి నిలిచివున్న మాలతి ముఖం ఆ విద్యుత్ కాంతిలో సంధ్యారుణ రాగభాసురమై వొప్పారుతోంది. "వెళ్ళొద్దు" అంది తలవంచుకుని.